క్లుప్తంగా

సిరిమాను ఉత్సవానికి పందిరి రాట



పందిరి రాట వేస్తున్న ఎంపీపీ, తదితరులు

నరసన్నపేట: మండలం సత్యవరంలో ఈ నెల 26 నుంచి 28 వరకు పదాలమ్మ తల్లి సిరిమాను ఉత్సవం నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా శుక్రవారం పందిరి రాట వేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ ఆరంగి మురళి దంపతులు చేపట్టారు. ఈ రోజు ఉత్సవం పనులు ప్రారంభించామన్నారు. మహోత్సవాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని, అందరూ సహకరించాలని ఎంపీపీ కోరారు. మేజరు పంచాయతీ వార్డు సభ్యులు ఇప్పిలి నీలం రాజు, సీర లక్ష్మీనారాయణ, గ్రామ పెద్దలు యగళ్ల చిన్ననర్సునాయుడు, చందు, కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ



చింతలబడవంజలో మాట్లాడుతున్న ఎంఈఓ

ఎల్.ఎన్.పేట: మండలంలోని చింతలబడవంజ, డొంకలబడవంజ, చిట్టిమండలం తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎంఈఓ ఎస్.శ్రీనివాసరావు శుక్రవారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. పాఠశాల పరిసరాలు, నాడు-నేడు పనుల రికార్డులు, విద్యార్థులు, ఉపాధ్యాయల హాజరు, మధ్యాహ్న భోజనం పథకం జగనన్న గోరుముద్ద, విద్యా బోధన తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి వారి నుంచి సమాధానాలు రాబట్టి విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకున్నారు. తరగతి గదిలో చదువుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయలకు సూచించారు. పర్యవేక్షణ కమిటీ సభ్యులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



అభయాంజనేయ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

మెళియాపుట్టి: మండలంలోని పట్టుపురం గ్రామంలో సుమారు 30 ఏళ్ల క్రితం నిర్మాణం చేపట్టి ప్రతిష్ఠించిన అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాంబాబుశర్మ అధ్వర్యంలో హోమం, మంగళహారతులు, మహాగణపతి పూజ, ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ధర్మకర్త జోగారావు గ్రామంలో ఆలయాన్ని నిర్మించారని, ప్రతీ ఏటా భక్తి శ్రద్ధలతో వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు పలువురు తెలిపారు.


రేషన్ డిపో ప్రారంభం



రేషన్ డిపోను ప్రారంభిస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి: మండలంలో మూలసవళాపురం గ్రామంలో గత రేషన్ డిపోలో అక్రమాలు చోటుచేసుకోవడంతో డిపోను తొలగించారు. అదే గ్రామంలో కొత్తగా రేషన్ డిపో మంజూరు చేయడంతో శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు సిరిపల్లి శ్రీనివాసరావు, బెండి శ్యామలరావు ప్రారంభించారు. అక్రమాలకు తావులేకుండా అర్హులందరికీ సమయానికి రేషన్ సరుకులు అందించడం జరుగుతుందన్నారు. వీఆర్వో అప్పారావు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులకు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

బూర్జ: మండలంలోని ఓ.వి.పేట అంగన్‌వాడీ కేంద్రాన్ని వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానిక సర్పంచ్ మెట్ట అమ్మాజమ్మ, వై.పాపయ్య, ఎ.రమణమూర్తి పాల్గొన్నారు.

వైఎస్సార్ కల్యాణమస్తు పేదలకు వరం

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: పేద ప్రజలకు వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫాతో ఎంతో మందికి మేలు జరుగుతుందని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం వైఎస్సార్ కల్యాణమస్తును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వధూవరులు వివాహమై 30 రోజులలోగా గ్రామ సచివాలయంలో దరఖాస్తు నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నూతన వధూవరులకు ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. అనంతరం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి నాలయకులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఏఎంసీ చైర్మన్ అర్జునుడు, వైస్ ఎంపీపీ సవిరిగాన ప్రదీప్, నాయకులు పనుకు మోహన్, ఎనుగుతల సూర్యం, గోకవలస రాము, సుధాకర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కాన్‌కాస్ట్ కార్మికులకు ప్రభుత్వం అండ



మాట్లాడుతున్న సువ్వారి గాంధీ

ఆమదాలవలస : దూసి కాన్‌కాస్ట్ ప్యాక్టరీ కార్మికులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ అన్నారు. పట్టణంలో శుక్రవారం కాన్‌కాస్ట్ కార్మికులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్యాక్టరీలో ఏళ్ల తరబడి పనిచేసిన 700 మంది కార్మికులకు రావాల్సిన బకాయిలు, ఇతర రాయితీలు త్వరితగతిన చెల్లించేందుకు ప్రభుత్వం సంబంధిత యాజమాన్యంతో చర్చించిందన్నారు. కార్మికులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి న్యాయం చేస్తారన్నారు. కార్మికులు ఇబ్బందులు, సమస్యలను గతేడాది ఆగస్టులో సీఎం జగన్‌కు విన్నవించడంతో సానుకూలంగా స్పందించారన్నారు. సీఎం కార్యాలయం నుంచి రెండు నెలల క్రితం కార్మికశాఖ కమిషనర్‌కు కార్మికుల సమస్యలపై లేఖ రాయడంతో వారం రోజుల క్రితం కార్మికశాఖ కమిషనర్ వచ్చి కార్మికులకు న్యాయం చేసే ఆర్థికపరమైన అంశాలపై చర్చించినట్లు పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కార్మికులకు అన్యాయం చేస్తే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పేడాడ వైకుంఠరావు, చింతాడ శివ కుమార్, పైడి విజయరమణారావు, గురుగుబెల్లి రాజశేఖర్, పి.ఆదినారాయణ, బొడ్డేపల్లి మోహన్ పాల్గొన్నారు.

పటిష్టంగా ఆహార భద్రతా చట్టం అమలు



వంటలను రుచి చూస్తున్న రాష్ట్ర కమిటీ సభ్యులు

నరసన్నపేట: ఆహార భద్రతా చట్టం పటిష్టంగా అమలు చేయాలని రాష్ట్ర ఫుడ్ కమిటీ సభ్యుడు బి.కాంతారావు అన్నారు. మండలంలోని బొరిగివలస, నరసన్నపేటల్లో పర్యటించి రేషన్ షాపులు, స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. బొరిగివలసలో రేషన్ డిపోలో సరుకుల పంపిణీ, నిల్వలు, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. నరసన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత (బోర్డు) పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. బొరిగివలస, హడ్కోకాలనీల్లో అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆహార భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అధికారులు, సిబ్బంది ఆహార భద్రతా చట్టం అమలుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అహారభద్రత అధికారి లక్ష్మి, డీఎస్ఓ వెంకటరమణ, ఎంఈఓ శాంతారావు, ఐసీడీఎస్ పీఓ నాగమణి, డీటీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో ఓటు నమోదు పూర్తిచేయాలి



మాట్లాడుతున్న ఆమదాలవలస నియోజకవర్గం అధికారి సవరమ్మ

పొందూరు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించిన నూతన ఓటరు నమోదు ప్రక్రియ రెండు రోజుల్లో పూర్తిచేయాలని ఆమదాలవలస నియోజకవర్గం ఓటరు నమోదు అధికారి టి.సవరమ్మ బీఎల్‌ఓలను ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలు, ఎన్నికల అధికారులు, మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మరణించిన ఓటర్లను, అనర్హులను ఓటరు జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. ఓట్లను ఆధార్‌కి అనుసంధాన ప్రక్రియ పూర్తిచేయాలని సూచించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించిన 10 మంది బీఎల్‌ఓలకు షోకాజ్‌న ఓటీసు జారీ చేయాలని తహసీల్దార్ రాంబాబుకు ఆదేశించారు. ఎలక్షన్ డీటీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అమృత్ సరోవర్‌తో చెరువుల అభివృద్ధి



సిబ్బందితో సమీక్షిస్తున్న ఏపీఓ రవి

మెళియాపుట్టి: అమృత్‌సరోవర్ ద్వారా ప్రతీ గ్రామ పంచాయతీలో గ్రామానికి దగ్గరగా ఉండే ఒక చెరువును ఉపాధి హామీ పథకం ద్వారా ఆహ్లాదకరమైన పార్కులా తీర్చిదిద్దనున్నట్లు ఏపీఓ రవి తెలిపారు. శుక్రవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. మొదటి విడతగా మండలంలోని పరశురాంపురం, జాడుపల్లి, పెద్దలక్ష్మీపురం, శేఖరాపురం, కొత్తూరు గ్రామ పంచాయతీల్లో ఉన్న చెరువులను అమృత్ సరోవర్ ద్వారా చెరువులను సుందరంగా రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 100 రోజుల పని దినాల కల్పనపై దృష్టి సారించాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది లక్ష్యాలను చేరుకోవాలని, నాణ్యతాలోపాలు లేకుండా పనులు చేయాలన్నారు. ఈసీ తారా ఆదినారాయణ రెడ్డి, పలువురు సాంకేతిక, క్షేత్రస్థాయి సిబ్బంది ఉన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న డీఎస్ఏ చీఫ్ కోచ్ మాధురీలత



స్కిప్పింగ్ పోటీల్లో బాలలు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థులకు క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఎం.మాధురీలత అన్నారు. అరసవల్లి సమీపంలోని వాడాడలో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం క్రీడా వేడుకలు ఘనంగా జరిగాయి. ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుందరరావు, మాధురీలత మాట్లాడుతూ క్రీడలతో మానసిక ప్రశాంతత, దారుఢ్యం లభిస్తుందన్నారు. అనంతరం బాలబాలికలకు బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, ఖోఖో, కబడ్డీ, క్రికెట్, కరాటే, కరసాము, కత్తిసాము, స్కిప్పింగ్, పరుగు పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ముద్దాడ సత్యప్రసాద్, ప్రిన్సిపాల్ ఉషా కిరణ్మయి, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి బీవీ రమణ, కోచ్ లక్ష్మణ్‌నాయుడు, పీఈటీ బాలకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

259 మందికి కంటి పరీక్షలు



విద్యార్థులక కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

నరసన్నపేట: మడపాం ఉన్నత పాఠశాల్లో 259 మంది విద్యార్థులకు శుక్రవారం కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో దృష్టి లోపం ఉన్న 16 మంది విద్యార్థులకు కళ్లద్దాలకు ప్రతిపాదనలు పంపామని పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆప్తాలిమిక్ ఆఫీసర్ బాలగంగాధర రాజు తెలిపారు. స్కూల్ హెచ్ఎం భారతి, ఏఎస్ఎం భవాని తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసన్నపేట: మేజరు పంచాయతీ పరిధిలోని పలు వీధుల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ కోటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. నిర్వహణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. స్టేట్‌బ్యాంక్, బైరాగి, బొడ్డవలస, జోగిపేట, మార్కెట్ వీధుల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

615 మంది విద్యార్థుల ఆధార్ నవీకరణ

మెళియాపుట్టి: మండలంలో ప్రత్యేక డ్రైవ్ ద్వారా ఆధార్ కేంద్రాలు ఏర్పాటుచేసి నాలుగు రోజులపాటు పలు సమస్యలను పరిష్కరించారు. ఆధార్‌లో ఉన్న తప్పులు సవరించుకోవడానికి, చేర్పులు, మార్పులను ఈ కేంద్రాల ద్వారా పరిష్కరించారు. స్థానిక ప్రభుత్వ కళాశాలలో 205 మంది, చాపర ఎస్.కె.కె జూనియర్ కళాశాలలో 205 మంది, పెద్దమడి గిరిజన సంక్షేమ కళాశాలలో165 మంది, మెళియాపుట్టి కేజీబీవీ పాఠశాలలో 40 మంది విద్యార్థుల డేటాను నవీకరించారు. నాలుగురోజులపాటు నిర్వహించిన ప్రత్యేక ఆధార్ కేంద్రాల సేవలు శుక్రవారంతో ముగిసినట్లు ఎంపీడీఓ పడాల చంద్రకుమారి తెలిపారు.

ఆశాజనకంగా వేరుశనగ సాగు



కోడూరు వద్ద ఏపుగా పెరిగిన వేరుశనగ పంట

పోలాకి: మండలంలోని రబీ వేరుశనగ సాగు ఆశాజనకంగా ఉంది. నవంబర్ ఆఖరివారం, డిసెంబర్ తొలివారాల్లో నాటిన పంట ఏపుగా పెరిగింది. మండలంలో దాదాపు 2 వేల ఎకరాల్లో సాగవుతున్న వేరుశనగ పంటపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. గతంలో ఎప్పుడూ సాగునీటికి ఇబ్బంది ఏర్పడేది. ఈసారి ఆరుతడి పంటకు కచ్చితంగా రెండు తడులకు నీరందించాలనే ఉద్దేశంతో వంశధార అధికారులు తీసుకున్న ప్రణాళికాబద్ధమైన చర్యలతో సాగునీటి ఇబ్బంది తప్పింది. ఇటీవల విపరీతంగా కురిసిన మంచు కారణంగా పంటకు నల్లపేనుబంక, పగటిపూట పెరుగుతున్న ఉష్ణోగ్రతలు కారణంగా శనగపచ్చపురుగు, పొగాకులద్దె పురుగు ఆశించాయని రైతులు చెబుతున్నారు. ఈ సమస్యపై మండల వ్యవసాయశాఖ అధికారి పి.చిరంజీవి వద్ద ప్రస్తావించగా.. పేనుబంకకు ఎసిటిమాప్రిడ్, ఎసిఫేట్, థైయామిథాక్జిమ్ వంటి మందులు పిచికారీ చేయాలని సూచించారు. లద్దెపురుగు, శనగపచ్చపురుగు వంటివాటి నిర్మూలనకు మోనోక్రోటోఫాస్, థయాడికార్బ్, ఇమామిక్టిన్ బెంజోయిట్, నోవాల్యురాన్ వంటి రసాయినాలను తగిన మోతాదులో పిచికారీ చేయటం వల్ల మంచి పలితాలు వస్తాయన్నారు. ఈ ఏడాది విత్తనాలు సరఫరాతోపాటు, ఎరువులు, సాగునీరు వంటి విషయాల్లో ఎక్కడా ఇబ్బంది కలగలేదని ఏఓ అన్నారు. కే6, జీ2 వంటి రకాలు (వేరుశనగ) ఎక్కువగా రైతులు పండిస్తున్నారని చెప్పారు.

పౌష్టికాహార కిట్లు పంపిణీ

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, లింక్ వర్కర్స్ స్కీమ్ పీఎల్‌హెచ్ ఐవీఎస్ కోడినేషన్ టీమ్స్ సంయుక్తంగా జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు వద్ద శుక్రవారం పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చైర్మన్ పి.జగన్మోహనరావు, జిల్లా టీబీ అధికారి డాక్టర్ అనూరాధ, డీపీఎం ఉమామహేశ్వరరావు, పార్టనర్ ఎన్‌జీఓ కో ఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతోనే మృతి

- గిరిజన వృద్ధుడి మృతిపై రాజకీయం చేయడం హేయమైన చర్య
- ఎంపీపీ రాణా ఈశ్వరమ్మ



మెళియాపుట్టి: మండలంలోని పెద్దపద్మాపురం పంచాయతీలోని మామిడిగుడ్డి గ్రామానికి చెందిన సవరబారికి అనే వృద్ధుడి మృతిని రాజకీయం చేయడం సమంజసం కాదని మెళియాపుట్టి ఎంపీపీ రాణా ఈశ్వరమ్మ అన్నారు. శుక్రవారం ఆమె మండల కేంద్రంలో మాట్లాడారు. సుమారు 90 ఏళ్లు దాటిన వృద్ధుడు సవరబారికి మృతిని.. ఆకలికేకలతో మృతి చెందారని వక్రీకరించి దుష్ప్రచారం చేయడం తెలుగుదేశం నాయకులకే చెల్లిందన్నారు. చివరి క్షణాల వరకు తానే సంరక్షణ బాధ్యతలు, బారికి బాగోగులు చూసుకున్నానని స్వయానా మేనల్లుడు సవర కైలాష్ శుక్రవారం ఎమ్మెల్యే రెడ్డి శాంతితో తెలిపారన్నారు. ఆకలి చావులనేవి రాష్ట్రంలో ఎక్కడున్నాయని ప్రశ్నించారు. ఇటువంటి దిగజారుడు రాజకీయాలు చేస్తే ప్రజలు అసహ్యించుకుంటారనే విషయం టీడీపీ నాయకులు తెలుసుకోవాలన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఇటువంటి రాజకీయాలు చేయడం మానుకోవాలన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణసాయం అందజేత



నరసన్నపేట: తక్షణ సహాయాన్ని అందజేస్తున్న సర్పంచ్, తదితరులు



సరుబుజ్జిలి: వైఎస్సార్ బీమా తక్షణసాయం పంపిణీ చేస్తున్న సర్పంచ్ కృష్ణ

నరసన్నపేట: మండల కేంద్రంలోని పాత స్టేట్ బ్యాంకు వీధికి చెందిన కింతలి జీవనరావు ఇటీవల మృతి చెందారు. మృతుని భార్య రమాదేవి రూ.10 వేలను వైఎస్సార్ బీమా తక్షణ సహాయాన్ని సర్పంచ్ బూరల్లి శంకర్, ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు శుక్రవారం అందించారు. పంచాయతీ ఈఓ సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: మండలంలో రావివలస గ్రామానికి చెందిన రుంకాన నాగభూషణం గురువారం మృతిచెందాడు. మృతుని భార్య చంద్రమౌళికి స్థానిక సర్పంచ్ వండాన కృష్ణ వైఎస్సార్ బీమా తక్షణ సహాయం కింద రూ.10 వేలను శుక్రవారం అందజేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్, వలంటీర్లు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై అప్రమత్తత అవసరం



అవగాహన కల్పిస్తున్న కో ఆర్డినేటర్ అరుణశ్రీ

సరుబుజ్జిలి: ఫ్లోరోసిస్ వ్యాధి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఫ్లోరోసిస్ కో ఆర్డినేటర్ అరుణశ్రీ తెలిపారు. మండలంలో కొత్తకోట గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫ్లోరోసిస్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనం తినే ఆహారంతో పాటు తాగే నీటిలో ఫ్లోరోసిస్ అధికంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ మునగాకు, నువ్వులు అధికంగా ఉండే పదార్థాలను తీసుకోవాలని సూచించారు. ఫ్లోరోసిస్ రావడం వల్ల ఎముకలు, దంతాలు పలుచబడి నడుము నొప్పి వస్తుందన్నారు. సాయి రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్ తాడేల రాజారావు, హెచ్ఎం జయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నరసన్నపేట: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 19 కేంద్రాల్లో కమ్యూనల్ రోస్టర్ రిజిస్టర్ అనుసరించి కేటాయిస్తున్న రిజర్వేషన్ల ద్వారా భర్తీ కానీ పోస్టులకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. వీటిన్నింటికీ ఓసీ కేటగిరీ అభ్యర్థులతో నింపాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల జారీ చేశారు. ఈ మేరకు స్థానిక పీఓ నాగమణి శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేశారు. దీంట్లో భాగంగా ప్రాజెక్టు పరిధిలోని ఐదు కేంద్రాల్లో కార్యకర్తలు, 10 ఆయా, 4 మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు భర్తీ కానున్నాయి. కలివరపుపేట, ఆదివరపుపేట, పెద్దకరగాం, తండ్యాలవానిపేట, పెద్ద బొరిగివలస, కొల్లవానిపేట, కొల్లివలస, రావాడపేట, బొద్దాం-1, రాజపురం-1 కేంద్రాల్లో ఆయాల పోస్టులు భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. పెద్దకరగాం, పారిశిల్లి, బుచ్చిపేట, నర్సింగపల్లి, జిల్లోడువలసల్లో కార్యకర్తల పోస్టులు, వనవిష్ణుపురం, సన్యాసిరాజుపేట, గడ్డెయ్యపేట, ఉప్పరిపేటల్లో మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.

కొత్తూరు: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్పర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు స్థానిక సీడీపీఓ టి.వి మలరాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తూరు మండలం పరిధిలోని కుద్దిగాం, హిరమండలం మండలంలోని కొండరాగోలు అంగన్‌వాడీల కేంద్రాల్లో ఖాళీగా ఉన్న హెల్పర్ పోస్టులకు ఓసీ కేటగిరికి చెందిన వ్యక్తులు ఈ నెల 11 నుంచి 18 తేదీలోగా సీడీపీఓ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులకు 18 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు ఉండాలన్నారు.

జలుమూరు: మండల పరిధిలోని శ్రీమన్నారాయణపురం (అంగన్‌వాడీ కార్యకర్త), దరివాడ ఆయా (ఓసీ) రిజర్వేషన్ల మేరకు గ్రామాల్లో అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు సీడీపీఓ వై.లావణ్య శుక్రవారం ప్రకటనలో కోరారు. అభ్యర్థులు ఈ నెల 18వ తేదీలోగా పూర్తి చేసిన దరఖాస్తులు కోటబొమ్మాళి సీడీపీఓ కార్యాలయం అందజేయాలన్నారు.

సారవకోట: సారవకోట, మెళియాపుట్టి, పాతపట్నం మండలాల్లోని ఐసీడీఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని సారవకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు పీఓ కె.కామాక్షి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సారవకోట మండలంలోని గోర్రిబంద, కుమ్మరిగుంట, తొగిరి, గోకర్ణపురం సహాయకురాలు పోస్టులకు జనరల్ కేటగిరి, గొపినాథపురం, బుద్దయ్యపేటలో మినీ కార్యకర్త జనరల్ కేటగిరికి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అలాగే పాతపట్నం మండలంలోని బడ్డుమరి పంచాయతీ పరిధిలోని కొత్తూరు కేంద్రంలో మినీ కార్యకర్త జనరల్ కేటగిరి, మెళియాపుట్టి మండలంలోని జాడుపల్లి-1, చాపర-2 సహాయకురాలు జనరల్ కేటగిరికి కేటాయించామన్నారు. దరఖాస్తులు ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5 గంటలులోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.


రూ.లక్ష విరాళం



ఆలయ ధర్మకర్తలకు రూ.లక్ష నగదును అందిస్తున్న రామరాజు

పాతపట్నం: మండలంలోని ఆర్.ఎల్.పురంలో రామాలయాన్ని గ్రామస్తులు నిర్మిస్తున్నారు. మూల విగ్రహాలకు రామరాజు చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు పారశెల్లి రామరాజు రూ.లక్ష నగదును విరాళంగా గ్రామ పెద్దలకు శుక్రవారం అందించారు. ఆలయ నిర్మాణానికి అందరూ సహకరించాలని ఆలయ ధర్మకర్తలు బోంగు రామారావు, అంపోలు మధు అన్నారు. కణితి బాలయ్య, డి.కుమార్, కె.కృష్ణమూర్తి, బి.ఉమాశంకర్ పాల్గొన్నారు.

పెరిగిన కట్టెజనుము సాగు విస్తీర్ణం



తురకపేట వద్ద కట్టెజనుము సాగు

ఎల్.ఎన్.పేట: మండలంలో కట్టెజనుము సాగు విస్తీర్ణం గతంలో 200 ఎకరాలు ఉంటే ఈ ఏడాది 400 ఎకరాలకు పెరిగిందని ఏఓ పైడి లతశ్రీ చెప్పారు. నూనె గింజల దిగుబడిని ఇచ్చే కట్టి జనము సాగు ఆరుతడి పంటగా చేస్తుంటారు. మండలంలోని వంశధార నదీ తీర గ్రామాలైన లక్ష్మీనర్సుపేట, పెద్దకోట, వాడవలస, బసవరాజుపేట, స్కాట్‌పేట, మోదుగువలస, మిరియాపల్లి, దబ్బపాడతోపాటు ధనుకువాడ, చిట్టిమండలం, రావిచెంద్రి, పూశాం, బొత్తాడసింగి, జాడుపేట, ఫాక్సుదొరపేట తురకపేట, సిద్ధాంతం, బరటాం తదితర గ్రామాల్లో అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. ఈ పంట కోసం పెట్టుబడి ఎక్కువగా అక్కరలేదని, విత్తనాలు వేసుకుంటే దిగుబడి వస్తుందని, రైతులకు లాభంగానే ఉంటుందని ఏఓ చెప్పారు.